# నేటి పంచాంగం



25 జూన్ 2025 బుధవారం (సౌమ్య వాసరః) శ్రీ విశ్వావసు నామసంవత్సరం ఉత్తరాయణం: గ్రీష్మ ఋతువు జ్యేష్ఠమాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె.5:47సూర్యాస్తమయం - సా.6:50 తిథి అమావాస్య సా 4:04 వరకు తరువాత పాడ్యమి నక్షత్రం మృగశిర ఉ.10:40 వరకు తరువాత ఆరుద్ర యోగం : గండ తె. 5:57 వరకు కరణం : నాగవ సా. 4:04 వరకు స్తుఘ్నమ రా. 2:41+ వరకు వర్జ్యం : సా. 6:24 నుండి రా.7:52 వరకు దుర్ముహూర్తం: ఉ.11:52 నుండి మ.12:44 వరకు రాహుకాలం : మ.12:18 నుండి మ.1:56 వరకు బ్రహ్మ ముహూర్తం : తె.4:11 నుండి తె. 4:59వరకు అభిజిత్ ముహూర్తం లేదు.రోజుకోరెమిడి తామరాకులతో నిత్యశివార్చన చేస్తూవుంటే ధనప్రాప్తి కలుగుతుంది.

డా. యోగిరాజ్ వైద్య (ఆస్ట్రాలజర్),
సెల్ : 7207377736


www.astramtelugu.com
అస్త్రం
డిజిటల్ తెలుగు దినపత్రిక

బుధవారం | 25 | జూన్ | 2025 | పేజీలు : 2


# ప్రతి ఒక్కరూ తల్లి పేరుమీద మొక్క నాటాలి

నిజామాబాద్, జూన్ 24: దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించడంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ దృఢంగా విశ్వసించారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. హిందువులలో జాతీయ పునర్నిర్మాణం జరగాలనే లక్ష్యంతోనే భారతీయ జనసంఘ్ను ఆయన స్థాపించారని సోమవారం (జూన్ 24) దుబ్బ చౌరస్తాలో నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, డా. ముఖర్జీ 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే' (ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు మరియు రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు) అనే నినాదాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. దేశ ఐక్యతకు ముప్పుగా భావించిన ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని, అది దేశ సమగ్రతకు ఆటంకమని ఆయన పేర్కొన్నారని ధన్పాల్ సూర్యనారాయణ తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, డా. ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా ఆర్టికల్ 370ని రద్దు చేసి, కాశ్మీర్ను సుందరీకరణ చేస్తున్నారని ఆయన ప్రశంసించారు.డా. ముఖర్జీ మరణం ఇప్పటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయిందని, ఆయన చేసిన గొప్ప త్యాగానికి గుర్తుగా మనం ప్రతి సంవత్సరం బలిదాన్ దివస్ను జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఉద్ఘాటించారు. ఈ గొప్ప నాయకుడి ఆదర్శాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుమీద ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఇది పర్యావరణ పరిరక్షణకు, తల్లుల పట్ల గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పంచ రెడ్డి ప్రవళిక, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, దుబ్బ మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఇంటలెక్చువల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కొండా ఆశన్న, తాజా మాజీ కార్పొరేటర్ మాస్టర్ శంకర్, మహిళా మోర్చా నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కృష్ణా, గోదావరి జలాలపై

# రేవంత్ రెడ్డి సవాల్

**కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణకు శాశ్వత మరణశాసనం రైతుభరోసా విజయోత్సవంలో సీఎం నిప్పులు**



హైదరాబాద్, జూన్ 25: కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకం విషయంలో తెలంగాణకు శాశ్వత మరణ శాసనం రాసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన సంతకాలు, వాటి పూర్తి ఆధారాలతో సహా తాను అసెంబ్లీకి వస్తానని, తెలంగాణకు ద్రోహం చేసిందెవరో శాసనసభలోనే తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన భారీ రైతుభరోసా విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన రైతులనుద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 'మన తదుపరి ఛాలెంజ్ రాజీవ్ యువ వికాసమే. యువతను ఆదుకునేందుకు సమగ్ర ప్రణాళికలతో సిద్ధమై వస్తాం. పదేళ్లపాటు అధికారంలో ఉంటాం. మిమ్మల్నందరినీ గుండెల్లో పెట్టుకొని చూసుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ, సోనియమ్మదే' అని రేవంత్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

'రైతుభరోసాలో భాగంగా రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఈ సంతోషకరమైన తరుణంలో, సచివాలయం సాక్షిగా, రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల రైతు కుటుంబాలు సంబరాలు చేసుకుంటున్నాయి. మా మొదటి ప్రాధాన్యత రైతులు. ఆ తర్వాత మా ఆడబిడ్డలు, తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థులు. అందుకే ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి మూడు నెలల్లోనే రూ. 7,625 కోట్లను ఒకే విడతలో రైతుల ఖాతాల్లో వేశాం. మొదటి సంవత్సరంలోనే 25, 35,964 మంది రైతుల ఖాతాల్లో రూ. 20,617 కోట్లు జమ చేశాం' అని ముఖ్యమంత్రి వివరించారు. గత ముఖ్యమంత్రి శాసనసభ సాక్షిగా 'వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లే... రైతులు పండించిన వడ్లను కొనబోం... అది మా బాధ్యత కాదు' అని చెప్పిన మాటలను రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 'ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే... 'మీరు వరి పండించండి. చివరి గింజ వరకూ కొంటాం. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇస్తాం' అని భరోసా ఇచ్చాం. మా మాటపై విశ్వాసముంచిన రైతులు 2.80 కోట్ల టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారు' అని ఆయన సగర్వంగా ప్రకటించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ల క్రితం రూ. 16,000 కోట్ల మిగులు నిధులతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్, పదేళ్లలోనే రాష్ట్రాన్ని రూ. 8.29 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి తమకు అప్పగించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 'రైతులకు నీళ్లిస్తున్నామంటూ కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు కొల్లగొట్టారు. నేను ఈ వేదికపై నుంచి అడగదలచుకున్నా... తెలంగాణ రాకముందు మీ ఆర్థిక పరిస్థితి ఏమిటి? హరీశ్ రావుకు మొయినాబాద్లో, కేటీఆర్కు జన్వాడలో, కేసీఆర్కు ఎర్రవల్లిలో ఫామ్హౌస్లు ఎలా వచ్చాయి? ఛానళ్లు, పేపర్లకు రూ. వేల కోట్ల పెట్టుబడులు ఎలా వచ్చాయి? మీరెలా ఐశ్వర్యవంతులయ్యారు? మరి దేశంలోనే ధనిక రాష్ట్రమైన తెలంగాణ ఎందుకు దివాలా తీసింది?' అని రేవంత్ రెడ్డి సూటి ప్రశ్నలు సంధించారు. 'అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60,000 మంది నిరుద్యోగులకు (మిగతా 2లో..)

# కాంగ్రెస్ పాలన గోల్డెన్ పీరియడ్

**భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**




హైదరాబాద్, జూన్ 25: తెలంగాణలో గత 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'గోల్డెన్ పీరియడ్'గా అభివర్ణించారు. రాబోయే రోజుల్లో పార్టీ అనేక అవకాశాలతో పాటు సరికొత్త సవాళ్లను కూడా ఎదుర్కోనుందని ఆయన అన్నారు. గాంధీభవన్లో మంగళవారం జరిగిన పీసీసీ (మిగతా 2లో..)

# ఎల్లారెడ్డిలో నూతన బస్టాండ్ ప్రారంభం

* ఆర్టీసీకి 'మంచి రోజులు' వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషికి ప్రశంసలు



ఎల్లారెడ్డి, జూన్ 24: గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అడుగంటిన ఆర్టీసీకి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి రోజులు వచ్చాయని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో నూతన బస్టాండ్ను ఘనంగా ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎల్లారెడ్డి బస్టాండ్ గత పాలకుల హయాంలో అధ్వానంగా మారిందని, ఇరుకు రోడ్లు, గుంతలు (మిగతా 2లో..)

## ఎల్లారెడ్డిలో నూతన బస్టాండ్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)కలుషితమైన నీటితో నిండి, కనీసం పట్టించుకునే నాథుడే లేకుండా పోయిందని మంత్రి గుర్తు చేసుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఈ బ స్టాండ్ పునర్నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని పొన్నం ప్రభాకర్ అభినందించారు. బ స్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎల్లారె డ్డి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఎప్పుడూ సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సంప్రదిస్తూనే ఉంటారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం ఒక వెనుకబడిన ప్రాంతమని, దీనిని అభివృద్ధి చేయడానికి సంబంధిత శాఖ మంత్రులు కృషి చేయాలని ఆయన పలుమార్లు మంత్రులతో చర్చించేవారని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న నేపథ్యంలో, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మంత్రి కొనియాడారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం, ప్రజలకు సన్న బియ్యం పథకం, ఫీజు రీయింబర్స్మెంట్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి పథకం ద్వారా పరిష్కారం జరుగుతున్నాయని ఆయన ఉదహరించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులను ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని, ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని తెలిపారు. నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణం జరుపుకున్నామని, త్వరలోనే వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి రానుందని వెల్లడించారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కూడా మంజూరైందని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బస్ డిపో ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను సభా వేదికగా కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ శర్మ, కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎల్లారెడ్డి ఆర్టీవో వీణ, ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు, ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యానారాయణ, ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా, గోదావరి జలాలపై రేవంత్ రెడ్డి సవాల్

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలిచ్చిన ప్రభుత్వం మాది. రైతు రుణమాఫీ, రైతుభరోసా, గిట్టుబాటు ధర, సన్నాలకు బోనస్, ఉచిత కరెంటు, స్ప్రింక్లర్లు, డ్రిప్లు, గిరి వికాసంలో సోలార్ పంప్సెట్లు, పంట కొనుగోలు... ఇలా దేనిపై చర్చ పెడతారో చెప్పండి కేసీఆర్? మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, పెట్రోల్ బంక్లు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ బస్సుల వంటి వాటితో ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం‘ అని ముఖ్యమంత్రి వివరించారు. ‘ఈ వేదిక నుంచి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు విన్నవిస్తున్నా... ఆలోచన చేయండి.. బేరీజు వేయండి. పదేళ్ల వారి పాలన ఎలా ఉందో.. 18 నెలల మా ప్రజాపాలన ఎలా ఉందో చర్చ పెట్టండి‘ అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

‘రేవంత్ రెడ్డి వచ్చాక గోదావరి-బనకచర్లతో చంద్రబాబుకు నీళ్లిస్తున్నారని కేసీఆర్ దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారు. చంద్రబాబుతో ఉండాలనుకుంటే అక్కడే ఉండేవాడిని కదా? ఆనాడు సోనియమ్మను నమ్మించి, కాళ్లకు దండం పెట్టి, కాంగ్రెస్తోనే ఉంటానని అబద్ధాలు చెప్పి, మోసం చేసిన చరిత్ర మీది. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు అండగా నిలబడాలని, నేను చంద్రబాబును కాదనుకొని, కాంగ్రెస్లో చేరి, ప్రజా ప్రభుత్వం తేవడానికి ప్రజలందరితో కలిసి నడిచా‘ అని రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. ‘ఇవాళ నేను చంద్రశేఖర్రావును సూటిగా అడుగుతున్నా.. చిత్తశుద్ధి ఉంటే గోదావరి జలాలపై శాసనసభలో చర్చపెడతాం. ప్రతిపక్షనేతగా స్పీకర్కు లేఖ రాయండి. మీరు చెప్పిన తేదీన అసెంబ్లీ పెట్టించే బాధ్యత మా శ్రీధర్బాబు తీసుకుంటారు. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసిందెవరు? ప్రాణహిత-చేవెళ్లను తరలించి రూ. లక్ష కోట్లు దోచుకున్నదెవరు? గోదావరి జలాల్లో 3,000 టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయని, రాయలసీమకు తరలించాలని 2016లో చెప్పిందెవరు? మీరు చెప్పిన తర్వాతే.. ఉమాభారతి ఆదేశాల మేరకు చంద్రబాబు 2016లో జీవో ఇచ్చిన మాట నిజం కాదా? వాప్కోస్ సంస్థ 400 టీఎంసీలు నీళ్లు బనకచర్లకు తరలించడానికి రిపోర్ట్ ఇవ్వడం వాస్తవం కాదా?‘ అని ముఖ్యమంత్రి కేసీఆర్ను నిలదీశారు.

‘మీ వందిమాగధులతో, అల్లుడితో మాట్లాడించడం కాదు... నేను సిద్ధంగా ఉన్నా. అసెంబ్లీలో ఎదురెదురుగా మాట్లాడుదాం. ఎవరు తెలంగాణకు అన్యాయం చేశారో చర్చించడానికి సిద్ధంగా ఉన్నారా? ఒక రోజు గోదావరిపై... రెండోరోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. తెలంగాణ విడిపోయినప్పుడు ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు పెట్టి, తెలంగాణకు శాశ్వతంగా మరణశాసనం చేసింది మీరు కాదా? సంతకాలు, ఆధారాలతో సహా అసెంబ్లీకి వస్తా‘ అని సవాల్ విసిరారు. ‘మీరు అధికారంలో ఉన్నప్పుడే ఏపీలో ముచ్చుమర్రి పనులు మొదలవలేదా? మీరున్నప్పుడే జగన్మోహన్రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్కు టెండర్లు పిలవలేదా? పోతిరెడ్డిపాడు నుంచి రోజుకు 10 టీఎంసీల నీటిని తరలించుకుపోవడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేసింది... మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కదా..? మీ తప్పులను కప్పిపుచ్చడానికే మీ అల్లుడు నన్ను తిడుతున్నారు‘ అని రేవంత్ రెడ్డి విమర్శించారు. ‘తెలంగాణలో భారాస చచ్చిన పాము. గోదావరి జలాల సెంటిమెంట్తో మంటలు పెట్టి పార్టీని మళ్లీ బతికించాలని ప్రయత్నిస్తున్నారు. ఏపీకి అనుమతిస్తే సుప్రీంకోర్టులోనే కలుసుకుందామంటూ నేను, మా ఉత్తమ్కుమార్రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్పివచ్చాం. మా చిత్తశుద్ధిని మీరా ప్రశ్నించేది‘ అంటూ సీఎం నిప్పులు చెరిగారు. ఈ సభలో వేదికపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహేశ్కుమార్గౌడ్, బట్టి విక్రమార్క, శ్రీధర్బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వాకిటి శ్రీహరి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ‘కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, వ్యవసాయమంటేనే కాంగ్రెస్‘ అని స్పష్టం చేశారు. రైతుభరోసా విజయోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ, ‘భారతదేశ చరిత్రలో రైతుభరోసా కింద తొమ్మిది రోజుల్లోనే రూ. 9,000 కోట్లను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేయడం ఇదే ప్రథమం. హరితవిప్లవం, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ పథకాలు, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతులకు రుణాలివ్వాలంటూ బ్యాంకులకు నిబంధనల విధింపు వంటివన్నీ కాంగ్రెస్ పార్టీ ఘనతే. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీని చేశాం. కౌలు రైతులకు, భూమిలేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ. 12,000 ఇస్తున్నాం‘ అని తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి రూ. లక్ష కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ‘సంక్షోభం నుంచి సంక్షేమాన్ని, విధ్వంసం నుంచి వికాసాన్ని కేవలం ఏడాదిన్నర పాలనలో సాధ్యం చేసి చూపించాం. సాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైనన్ని నిధులు కేటాయిస్తున్నాం. తొమ్మిది రోజుల్లోనే రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో వేసి కాంగ్రెస్ అంటే కోతల ప్రభుత్వమంటూ విమర్శించిన వారి నోళ్లను మూయించాం. రైతుల ప్రయోజనార్థం వివిధ పథకాలు రూపొందిస్తుంటే ప్రతిపక్ష పార్టీ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు‘ అని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ‘ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఎస్ఎల్బీసీ, సీతారామ, దేవాదుల, ప్రాణహిత-చేవెళ్ల... ఇలా ఏ ప్రాజెక్టు చూసినా ఆగిపోయింది. ప్రాణహిత-చేవెళ్ల పేరు, అంచనాలు మార్చి.. రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిన కాళేశ్వరం.. కట్టిన మూడేళ్లకే కూలేశ్వరం అయింది. దీనికి కారణం మీ అవినీతి కాదా?‘ అని ప్రశ్నించారు. ‘వివిధ ప్రాజెక్టులకు కాంట్రాక్టర్లకు రూ. 2 లక్షల కోట్ల బిల్లులు చెల్లించారు. మరి రూ. వెయ్యి కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి ఎందుకు ఆగింది? రూ. 300 కోట్లతో పూర్తవ్వాల్సిన భీమా, రూ. 200 కోట్లతో చేయాల్సిన నెట్టెంపాడు ఎందుకు కాలేదు? ఇవన్నీ ఆగిపోవడానికి మీరు కారణం కాదా కేసీఆర్?‘ అంటూ సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ పై విరుచుకుపడ్డారు.

# కాంగ్రెస్ పాలన గోల్డెన్ పీరియడ్

(మొదటిపేజీ తరువాయి)

నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం, అనంతరం జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) అంతర్గత సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ రెండు సమావేశాల్లో ముఖ్యమంత్రి ప్రసంగ సారాంశం ఇలా ఉంది.దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుందని, దీనితో శాసనసభ స్థానాలు పెరిగే అవకాశం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావడంతో మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు వస్తాయని తెలిపారు. జమిలి ఎన్నికల ప్రస్తావన కూడా ఉందని, ఇవన్నీ పార్టీకి రాజకీయ అవకాశాలను, అదే సమయంలో సవాళ్లను కూడా తీసుకువస్తాయని ఆయన నాయకులను ఉద్దేశించి అన్నారు. ఈ మార్పులకు నాయకులంతా సిద్ధంగా ఉండాలని, ఆ సమయానికి సన్నద్ధంగా లేకపోతే బీ-ఫామ్ తమ వద్దకు రాదని స్పష్టం చేశారు. ప్రసార సాధనాల్లో కొన్ని పార్టీకి సహకరించవచ్చని, మరికొన్ని సహకరించకపోవచ్చని ఆయన అంచనా వేశారు. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి (భారాస) పాలనతో పోల్చి 18 నెలల కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లో చర్చలు పెట్టాలని, అందుకు సవాల్ చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, రుణమాఫీ, రైతుభరోసా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలను లెక్కలతో సహా ప్రజలకు వివరించి, వారిని ఒప్పించి పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.జుబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ఉపఎన్నికలో తానే అభ్యర్థిని అని కొందరు ముందుగానే ప్రకటించుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. పార్టీ అభ్యర్థిని నిర్ణయించిన తరువాత, అందరూ బాధ్యతగా తీసుకుని గెలిపించుకోవాలని సూచించారు. పదవులు రాలేదని కొందరు గాంధీభవన్కు గొర్రెలతో వచ్చి ధర్నాలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా ఇన్చార్జి మంత్రికి లేదా తనకు, పీసీసీ అధ్యక్షుడికి చెప్పుకొనే అవకాశం అందరికీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి ధర్నాలు చేయడం సరికాదని, ఇలాంటివి జరగకుండా జిల్లా ఇన్చార్జి మంత్రులు ముందే చొరవ చూపి పార్టీలో అంతర్గత విభేదాలను సరిదిద్దాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పార్టీ కమిటీలన్నిటినీ వెంటనే ఏర్పాటు చేయాలని, బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటేనే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లగలుగుతామని నొక్కి చెప్పారు. పార్టీ నిర్మాణంపై పీసీసీ ప్రత్యేక దృష్టి సారించాలని, పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయని అన్నారు. పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులిచ్చామని, మార్కెట్ కమిటీలు, దేవాలయాల కమిటీల వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన నాయకుల పేర్లను జిల్లాల ఇన్చార్జి మంత్రులు ప్రతిపాదించాలని సూచించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అనేక సామాజిక అంశాలను కూడా పరిష్కరించిందని, వీటిని ప్రజలకు చెప్పడానికి తాను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని రేవంత్ రెడ్డి తెలిపారు.ఏ రాజకీయ నాయకులైనా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకూ ఎదగడానికి పార్టీ వేదికలే ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి అన్నారు. వేల మంది పీసీసీ రాష్ట్ర నూతన కార్యవర్గ పదవులకు పోటీపడగా, అందులో నుంచి కొందరిని ఎంపిక చేసి అవకాశమిచ్చారంటే.. వారు పార్టీని ముందుకు నడిపించడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుగ్గా పనిచేస్తారని గుర్తించడం వల్లేనని తెలుసుకోవాలని సూచించారు. పీసీసీ పదవులు దక్కినవారిలో బాగా పనిచేసే వారికి 2029లో ఏర్పడే ప్రభుత్వంలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తాను 2018లో వర్కింగ్ ప్రెసిడెంట్గా, 2023లో సీఎంగా బాధ్యతలు చేపట్టానంటే పార్టీ బాధ్యత నుంచే తనకు పదోన్నతి వచ్చిందని తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులుగా రాణించినవారు అనేకమంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎదిగారని ఉదాహరించారు. గతంలో కొందరు నేతలకు పార్టీ రాష్ట్ర అనుబంధ సంస్థల బాధ్యతలు ఇస్తామంటే అవి తమ హోదాకు తక్కువ అని, వాటిని తీసుకోం అని తిరస్కరించారని, అయితే ఆ రోజు వాటిని తీసుకుని పార్టీ కోసం పనిచేయడానికి ముందుకు వచ్చిన వారిలో 65 మందికి.. ఇప్పుడు కార్పొరేషన్ ఛైర్మన్లుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా పదవులు దక్కాయని ఆయన వివరించారు. నిర్మలా జగ్గారెడ్డి కష్టపడినందునే పార్టీ ఆమెకు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పదవి ఇచ్చిందని పేర్కొన్నారు. పీసీసీ కార్యవర్గ పదవీ కాలం మూడేళ్లు మాత్రమేనని, 2029లో అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని, అప్పటిలోగా పనిచేయని వారిని బాధ్యతల నుంచి పీసీసీ అధ్యక్షుడు పక్కన పెడతారని హెచ్చరించారు.కార్యకర్తలు పోటీచేసే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వారిని గెలిపించుకునే వారికి రాష్ట్రస్థాయి పదవులు వస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. అప్పుడే పార్టీ బలోపేతమై రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అన్ని పార్టీలు వరుసగా రెండేసిసార్లు అధికారంలోకి వచ్చాయని, కాంగ్రెస్ కూడా ఇదే ఆనవాయితీతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ను గత భారాస ప్రభుత్వం దళారుల అడ్డాగా మార్చిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 60 వేల ఉద్యోగాలిచ్చామని అన్నారు. పేదవాడికి విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంచామని తెలిపారు. గత 18 నెలల్లో రూ. 1.04 లక్షల కోట్లు రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ ఆదర్శంగా నిలిచి ముందుకెళుతోందని అన్నారు. కులగణన సర్వే నిర్వహించి దేశమంతా జరిగేలా కేంద్రప్రభుత్వం మెడలు వంచామని, ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తెచ్చామని, రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని వివరించారు. పీసీసీ నూతన ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారికి నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, ఇతర సీనియర్ నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.